చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలన

ఫోటోరైటప్.4. పరిశీలిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-పాయకరావుపేట: మండలంలోని అరట్లకోట గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఈఓపీఆర్‌డి సీహెచ్ చంద్రశేఖర్, సర్పంచ్ పులగపూరి అప్పలనర్స పరిశీలించారు. కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి సంపద తయారీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఉపసర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమంలో పలు అంశాలపై ఈఓపీఆర్‌డి చంద్రశేఖర్ శిక్షణ ఇచ్చారు.

కొత్త దుకాణాల్లో పాత సారా!

- సిండికేట్‌గా మారిన అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు
- సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు ధిక్కరిస్తున్న మద్యం వ్యాపారులు, - సహకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు
- అధిక ధరల్లో మద్యం విక్రయాలు - బ్లాక్ లో ఏరులై పారుతున్న మద్యం

ఏ.పి. రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి ఆరోపణ

విశాలాంధ్ర-చోడవరం: కొత్తగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో పాత మద్యం అమ్మకాలు జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు మొద్దు నిద్ర నటిస్తూ మద్యం వ్యాపారులకు సహకరిస్తున్నారని ఏ.పి.రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నూతన మద్యం పాలసీ ప్రకారం జిల్లా ఉన్నతాధికారులు చే వేలం పాటలు నిర్వహించి, చోడవరంలో ఈ నెల 16 నుండి నూతన దుకాణాలు ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు తాత్కాలిక పర్మిషన్ అంటూ పచ్చ జెండా ఊపారు. కొత్తగా మద్యం ప్రైవేటు దుకాణాలు ఏర్పాటు చేసారు, కానీ కొత్త దుకాణాల్లో పాత మద్యం, అధికధరలతో అమ్ముతుండటంతో మద్యం ప్రియులు ఆందోళన చెందుతున్నారు. సిండికేట్ గా మారిన అధికార కూటమి, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, నాయకులు సిండికేట్ గా మారి మద్యం వేలం పాటల్లోనూ, అధిక ధరలకు మద్యం అమ్మకాల్లోను ప్రజలను పట్టి పీడిస్తున్నారు. అధిక ధరలతో మద్యం అమ్మకాలు లో వ్యాపారులకు, ప్రభుత్వ పెద్దలకు ఎక్సైజ్ అధికారులు వత్తాసు పలుకుతూ సాధారణ, మధ్యతరగతి ప్రజానీకాన్ని నిలువునా దోచుకుంటున్నారు. ప్రభుత్వం, రాజకీయ నేతలు నిన్నటి వరకు కొత్తగా ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పడుతున్నాయని, తక్కువ ధరకు మద్యం అందుబాటులో వుంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అలాగే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం నిల్వలు లేవంటూ గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాలు మూసివేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ప్రైవేటు మద్యం దుకాణాలు లో జగనన్న మద్యం ప్రత్యక్షమవ్వడంతో ఎక్సైజ్ అధికారులు, కూటమి ప్రభుత్వం మద్యం పై ఆడుతున్న మధ్యంతర నాటకం తేట తెల్లమవుతోంది. కూటమి ప్రభుత్వం మద్యం పాలసీ పై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. భారత సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు ప్రకారం హై వేలు, గుడి బడికి 200 మీటర్లు దూరం వుండాలనే ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. అంతేగాక బ్లాక్ లో అధిక ధరలకు మద్యం ఏరులై పారుతుండటం మరో ఎత్తు. ఒక్కో సీసా పై రూ.100 నుండి 200 లు పైగా వేసి బ్లాక్ లో అమ్ముతున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. రోజంతా కష్టించి పనిచేసే కార్మికులకు, అలవాటుగా మారిన మద్యం ప్రియులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల ప్రైవేటు దుకాణాలకు వేలం పాటలు జరిపిన ప్రభుత్వం, ఎప్పటి నుండి ప్రైవేటు మద్యం దుకాణాలు లో కొత్త మద్యం అందుబాటులో వస్తుంది అనే విషయాన్ని ఎక్సైజ్ అధికారులు స్పష్టత ఇవ్వక పోవడంతో దళారీలు, కొత్త మద్యం దుకాణదారులు అధిక ధరలు దండుకుంటున్నారు.

గొర్రెలు, మేకలకు ఉచితంగా నత్తల నివారణా మందులు పంపిణీ

పశు వైద్యశాల సహాయ సంచాలకులు రాంబాబు

విశాలాంధ్ర-గొలుగొండ: మండలంలో మేకలు, గొర్రెలుకు నట్టల నివారణకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని గొలుగొండ ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు రాంబాబు అన్నారు. ఈనెల 16 నుండి 31 వరకు ఈ మందులు పంపిణీ చేయడం జరుగుతుందని ఆయన అన్నారు నట్టల నివారణ ద్వారా జీవాల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి పిల్లల మరణాలు రేటు తగ్గుతుందని శరీర బరువు పెరుగుదల రేటు కూడా వృద్ధి చెందుతుందని ఆయన అన్నారు గొర్రెల పెంపకం దారులు అందరూ గ్రామ రైతు సేవా కేంద్రంలోని పశుసంవర్ధక సహాయకులను కానీ పశు వైద్యశాలను కానీ సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు ఈ సందర్భంగా మండలంలో కుమిర గ్రామంలో ఈ నట్టల నివారణ మందు పంపిణీ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చందక నరసింహులు ప్రత్యేకంగా పర్యవేక్షించారు ఈ కార్యక్రమంలో గోల్కొండ పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ కృష్ణ దేవి పేట పశువైద్యాధికారి డాక్టర్ శిరీష తెలుగుదేశం పార్టీ ప్రతినిధి కర్రి ఏది నాయుడు, పశువార్త కోసం అసిస్టెంట్ అనూష గొర్రెలు మేకలు పెంపకం దారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పై పాలకులు దృష్టి సారించాలి

విశాలాంధ్ర-కే కోటపాడు: గ్రామ పరిపాలన పై పంచాయతీ పాలకులు దృష్టి సారిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో సాంబశివరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో చివరి రోజు 16 గ్రామపంచాయతీల ఉప సర్పంచ్ లకు వార్డు సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో స్థానిక సంస్థల పాత్ర ఎంతో కీలకమన్నారు. వార్డు సభ్యులు పంచాయతీ తీర్మానాలు విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గ్రామ సుపరిపాలనకు వారే పునాది అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సూపరిండెంట్ అప్పలరాజు ఈవోపీఆర్డి సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు శిలాఫలకానికి జగన్ బొమ్మలు రక్షణ !

జగన్ ఫోటో ఉన్న పేపర్తో శిలా ఫలకం కప్పిన దృశ్యం ఫోటో

విశాలాంధ్ర-కె. కోటపాడు : ఇంజనీరింగ్ అధికారులకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై ప్రేమ పోలేనట్లుంది. మండలంలోని ఆర్. వై అగ్రహారంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని శనివారము పల్లె పండగ కార్యక్రమం లో భాగంగా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించవలసి ఉంది. ఇందు కోసం శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిలాఫలకానికి రక్షణగా జగన్ బొమ్మలతో ఉన్న దినపత్రికలను అంటించడంతో అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు పేర్లతో ఏర్పాటుచేసిన శిలాఫలకానికి కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం అని పలువురు వ్యాఖ్యానించారు.

అధికారులు మారినా.. సమాచార బోర్డుపై మారని పేర్లు

విశాలాంధ్ర-పరవాడ: అధికారులు మారి రోజులు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయంలోని సమాచార బోర్డుపై అధికారుల పేర్లు మారడం లేదు. అధికారులు విధుల్లో చేరి వారాలు గడుస్తున్నప్పటికీ బదిలీ అయిన అధికారులు పేర్లే ఇంకా దర్శనమిస్తున్నాయి. పరవాడ తహసిల్దార్ కార్యాలయంలో సమాచార బోర్డుపై ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ పౌర సమాచార అధికారి (డిప్యూటీ తహశీల్దార్)గా పనిచేసిన డి.శాంతిభూషణరావు బదిలీ అయి మూడు వారాలు అవుతోంది. అతని స్థానంలో సురేష్ నాయుడు విధుల్లో కూడా చేరారు. అలాగే అప్పిలేట్ అథారిటీ అధికారి (ఆర్డీవో)గా పనిచేసిన ఎ.జి.చిన్ని కృష్ణ కూడా బదిలీ కాగా ఆయన స్థానంలో షేక్ ఆయిషా విధుల్లో చేరారు. అయినప్పటికీ ఇక్కడ తహసిల్దార్ కార్యాలయంలోని సహ చట్టం బోర్డుపై ఇంకా పాత పేర్లు, ఫోన్ నెంబర్లు దర్శనమిస్తున్నాయి. దీంతో కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలు తికమక పడుతున్నారు. ఎవరు ఏ అధికారో.. ఏ సమాచారం ఎవరికి అడగాలో తెలియక చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి బోర్డుపై అధికారుల పేర్లు సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిమెంటు రోడ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండలంలో పల్లె పండుగ కార్యక్రమం లో భాగంగా సైతారుపేట, సర్వసిద్ధి, లింగరాజుపాలెం, కర్రివానిపాలెం, వెంకటాపురం, వాకపాడు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎపిఓ ఎరకయ్య, సర్పంచులు రావి రమణబాబు, కురందాసు గణేష్, ఎంపిటిసి సేనాపతి రాము, మండల టిడిపి అధ్యక్షులు అమలకంటి అబద్ధం, టిడిపి సీనియర్ నాయకులు దండు అచ్యుతరామరాజు, నల్లపరాజు వెంకటరాజు, గుర్రం రామకృష్ణ, తుమ్మపాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజలకు అందబాటులో వాటర్ ట్యాంకు...

విశాలాంధ్ర-పాయకరావుపేట: పట్టణంలోని సహస్ర ఆసుపత్రి, లక్ష్మీ గణేష్ ఫైర్‌వర్క్స్ సంయుక్త ఆధ్వర్యంలో కంభంపాటి వెంకట రమణ మనవరాలు నిహిర శ్రీసహస్ర పుట్టినరోజు పురస్కరించుకొని పట్టణ ప్రజల సౌకర్యం కొరకు సేవా కార్యక్రమంలో భాగంగా వాటర్ ట్యాంకును అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటర్ ట్యాంకును జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, జనసేన నాయకులు తోట నగేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రటరీ జగతా శ్రీను, యాళ్ళ వరహాలబాబు, పెదపాటి మేఘరంజన్, జగతా శ్రీధర్, రాజాన ఆది, వేముల వెంకటేశ్వరరావు, కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటర్ నమోదు పై అవగాహన

విశాలాంధ్ర-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్.ఎస్.ఎస్), ఎస్.వి.ఈ.ఈ.పి, రెవెన్యూ శాఖ సౌజన్యంతో శుక్రవారం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత చాలా ముఖ్యమని, డిగ్రీలో ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులందరూ రెవెన్యూ డిపార్ట్మెంట్ నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. ఎస్ వి ఈఈ పి వారు నిర్వహించిన ఓట్ల నమోదు కార్యక్రమంలో ఆన్లైన్లో ఆఫ్ లైన్ విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు . ఈ ఒక్క కార్యక్రమం కొరకు విద్యార్థులు తరఫున గాయత్రి బీఎస్సీ అమ్మాయిని అంబాసిడర్ గా నియమించడం జరిగినదన్నారు.విద్యార్థులు వారి బర్త్ సర్టిఫికేట్, ఆధార్ ,నివాస పత్రమును సమర్పించి ఆన్లైన్లో ఓటరుగా నమోదు చేయబడునన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి మాల్యాద్రి, సీనియర్ అధ్యాపకులు వి అప్పలనాయుడు, ఎస్ ఎం రఫుద్దీన్,హెచ్ సుధీర్ ఐ వి వి సత్యవతి, డాక్టర్ జ్యోతి సూర్యవతి ,డాక్టర్ లక్ష్మీ మంగమ్మ, డాక్టర్ కృష్ణారావు డాక్టర్ జి నారాయణమూర్తి,జి వెంకటేష్, పిడి మూర్తి పాలిటిక్స్ సరస్వతి, హిస్టరీ రామలక్ష్మి, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వరాహ నదిని పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-యస్.రాయవరం :మండలంలో వరహానది పరివాహక ప్రాంతాలు దార్లపూడి, సోముదేవుపల్లి, పెద ఉప్పలం గ్రామాల్లో మండల అధికారుల బృందం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు పేదలకు ఉచితంగా ఇసుక ఇచ్చేందుకు గురించేందు అధికారులు వెళ్లారు. అయితే నదిలో నీరు ప్రవహించడంతో నీరు తగ్గుముఖం పట్టిన తరువాత పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జె. రమేష్ బాబు, ఎంపిడిఓ సత్యనారాయణ, ఇరిగేషన్ ఎఈ బాను, ఆర్ఐ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.99 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు

టిడిపి మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

భివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-పాయకరావుపేట: పల్లె పండుగ కార్యక్రమం ద్వారా మండలంలోని పలు గ్రామాల్లో సుమారు రూ.1.99కోట్లతో రోడ్లు, డ్రైన్లు నిర్మించనున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. మండలంలోని పాల్తేరు, శ్రీరాంపురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. పాల్తేరు గ్రామంలో రూ.20లక్షలతో, శ్రీరాంపురం గ్రామంలో రూ.13.5లక్షలతో రోడ్డు, డ్రైన్లు నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ 75శాతం ఉపాధి హామీ పథకం నిధులు, 25శాతం పంచాయతీ నిధులతో అభివృద్ధి పనులు చేస్తారని తెలిపారు. రాష్ట్ర హెం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడుస్తుందని చిట్టిబాబు తెలిపారు. ఈకార్యక్రమంలో దేవవరపు రాజబాబు, చింతకాయల రాంబాబు, బొంది కాశీవిశ్వనాథ్, ఎంపిడీఓ జయప్రకాశరావు, పంచాయతీ రాజ్ ఏఈ కచేరి, ఏపీఓ హేమలత, దేవవరపు రఘు, గోనల కృష్ణ, మాకినీడి చిట్టిబాబు, దేవవరపు శివరాజు, దాసరి జగదీష్, దేవవరపు కన్నారావు, అనిశెట్టి వెంకటసూరి, కొమ్మిరెడ్డి సత్తిబాబు, శ్రీరాంపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గారా కృష్ణప్రసాద్, చించలపు ప్రదీప్, తలారి రాజా, గుడిబంటి శాంతమ్మ, పంచాయతీ కార్యదర్శి వై.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాల్మాన్‌పేట సర్పంచ్ సస్పెండ్ ఎత్తివేత

సర్పంచ్ కోటేశ్వరరావు

విశాలాంధ్ర-పాయకరావుపేట: తనపై విధించిన సస్పెండ్‌ను హైకోర్టు కొట్టివేసినట్లు మండలంలోని పాల్మాన్‌పేట సర్పంచ్ కోడా కోటేశ్వరరావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామానికి చెందిన ఇద్దరికి సాల్‌వెన్సీలపై సంతకాలు చేసినట్లు గ్రామానికి చెందిన మైలపల్లి అశోక్ చక్రవర్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన అధికారులు కోడా కోటేశ్వరరావును సర్పంచ్ పదవి నుండి 3నెలల సస్పెండ్ చేస్తూ డీపీఓ శిరీషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై కోడా కోటేశ్వరరావు హైకోర్టును ఆశ్రయించగా సస్పెండ్‌ను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పిఎస్‌పేట గ్రామసభలో 101 ప్రజా అర్జీలు

విశాలాంధ్ర-చోడవరం: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు మండలంలోని పి.ఎస్.పేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో 101 భూ సంబంధిత రెవెన్యూ సమస్యలు పై అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఏ.రామారావు తెలియజేసారు. రీ సర్వే గ్రామ సభలు లో భూ సంబంధిత, రెవెన్యూ సమస్యలు ప్రజలు అందించిన అర్జీలకు అధికారులు నెలరోజులు కాలపరిమితి లో పరిష్కరిస్తారు అని తెలిపారు. భూ రికార్డులు, సర్వే నెంబర్ సబ్ డివిజన్, పేర్లు తప్పులు, భూ తగాదాలు, అన్నదమ్ముల పంపిణీ, కోర్టు వ్యవహారాలు తదితర అన్ని అంశాలపై అవకాశమున్నంత వరకు రైతాంగ సమస్యలు పరిష్కారం చూపుతామని, లేనిచో ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి సహాయమందించిన స్నేహాంజలి

విశాలాంధ్ర-చోడవరం : ఆపదలో ఉన్న ఒక వికలాంగు నికి మేమున్నామంటూ స్నేహం జలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సాయం అందించింది. అనకా పల్లి జిల్లా చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడైన మువ్వల శ్రీనుకి గత 20 రోజుల క్రితం రోడ్ యాక్సిడెంట్ లో తన రెండో కాలు విరిగిపోయింది. తన చిన్నతనంలో ఒక కాలు విరిగిపోగా ,గత నెలలో రోడ్ యాక్సిడెంట్ లో తన రెండో కాలు పోగొట్టుకున్నాడు శ్రీను. కాలులో ఉన్న నరాల కూడా చిట్లిపోయాయి. ఆపరేషన్ నిమిత్తం ఒక లక్ష రూపాయల వరకు అవుతుందని డాక్టర్ చెప్పాగా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్య సేవలు అందకపోవడంతో పాటు ఆయనకి సహాయం చేయడానికి తనవాళ్లు అంటూ ఎవరూ లేరు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో వెంకన్నపాలెం ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోవింద్ ముందుకు వచ్చి విరాళాలు సేకరించి ఆపరేషన్ చేయించారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్గనైజేషన్ సభ్యులు శ్రీను ని శుక్రవారం ఇంటి వద్ద పరామర్శించి ఆందోళన చెందవద్దని చెప్పి మెడికల్ ఖర్చులు కోసం స్నేహం జలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ తరుపున 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో స్నేహాంజలి ఆర్గనైజేషన్ సభ్యులు కోరిబిల్లి బాలకృష్ణ , ఫణీంద్ర, కరక గోవింద్,టీటి సూకరాజు, రేగిన అప్పారావు పాల్గొన్నారు.

కొండ బంజరులో యూకలిప్టస్ తోట మాయం!

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర-వరవాడ: పెదముషిడివాడ పంచాయితీ లో ప్రభుత్వ ఆస్తుల అన్యాక్రాంతం కొనసాగుతూనే ఉంది. ఓ పక్క ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూనే కొందరు కొండ బంజర్లలోని వృక్ష సంపదను కూడా అక్రమంగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో సర్వేనెంబర్ 410 లోని సుమారు 10 ఎకరాల కొండ బంజరులో విలువైన యూకలిప్టస్ తోటను మాయం చేసారు. దర్జాగా కూలీలతో నరికించి వాహనాలతో సరుకును తరలించారు. దీని విలువ సుమారు రూ.8 లక్షల వరకూ ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఆ సమయంలో రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ వారెవరు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా రెవెన్యూ అధికారుల అండదండలతోనే జరిగినట్లు విమర్శలు ఉన్నాయి. ఓ పక్క ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించి విక్రయిస్తుండగా, మరో పక్క ప్రభుత్వ భూముల్లోని విలువైన వృక్ష సంపదను దోచుకోవడం చూస్తుంటే అధికారుల పనితనం ఏమిటో ఇట్టే అర్థమవుతుంది. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలన్న వినతులపైనా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదు. దీంతో రెవెన్యూపై అనేక అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ జిల్లా ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి యూకలిప్టస్ తోటను అమ్ముకున్న అక్రమార్కులపై చర్యలు తీసు కోవడంతో పాటు ఆ సొమ్మును రికవరీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పూర్తిచేయాలి

- సాగు నీటి వనరులు అభివృద్ధి చేయాలి...
- రైతాంగ ప్రాంతీయ సదస్సు జీపు జాత ప్రారంభించిన కమ్యూనిస్టు నేతలు ...

విశాలాంధ్ర-చోడవరం : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తో బాటు అన్ని సాగునీటి వనరులు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22 న అనకాపల్లి లో జరుపతలపెట్టిన రైతాంగం ప్రాంతీయ సదస్సు విజయవంతం చేయాలని కోరుతూ కమ్యూనిస్టు నేతలు, ఏ. పి.రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి పల్లి అప్పలరాజు జీపు జాత ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి మాట్లాడుతూ ఈ నెల 22న ఉదయం 10 గంటలకు అనకాపల్లి రోటరీ హాల్ లో రైతాంగం ప్రాంతీయ సదస్సు ప్రారంభం అవుతుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో గల అన్ని సాగునీటి వనరులు, ప్రాజెక్టులు అభివృద్ధి చేసి, సుమారు 25,000 చెరువులు, 23.24 లక్షల ఎకరాల సారవంతమైన పంట భూములకు సాగునీరు అందించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులు వున్నను అవి మరమ్మత్తులకు, శిథిల స్థితికి, దురాక్రమణకు గురి కావడంతో ఖరీఫ్ సీజన్ లో నే వర్షాధారం పైనే పంటలు పండించాల్సిన దుస్థితి దాపురించింది అన్నారు. ఉత్తరాంధ్ర లో అత్యధిక శాతం వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలపై ప్రేమ చూపుతున్న పాలకులు వెనుకబడిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి విషయంలో తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. సాగునీటి వనరులపై పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి బీడువారిన భూములతో వర్షాల కోసం ఎదురుచూస్తూ పంటల కోసం తెచ్చిన పెట్టుబడులు తిరిగిరాక రైతన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని అన్నారు. 'సాగునీరు అందించే అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును పాలకులు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తక్షణమే ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టుల నిర్మాణానికి రాబోయే బడ్జెట్లో నిధులు కేటాయించి ఈ ప్రాంత రైతాంగానికి విశ్వాసం కలగజేసే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోరుతోంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.పి. చెరకు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ వేచలపు వెంకటరమణ (కాసుబాబు) తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలి

ఓటు హక్కుపై విద్యార్థినులకు తహశీల్దార్ అవగాహన

విశాలాంధ్ర-యస్.రాయవరం: ఓటుహక్కు నమోదు పై కాలేజీ విద్యార్థినులకు తహసిల్దార్ జె. రమేష్ బాబు అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు నమోదు, బదిలీ, తొలగింపు, చిరునామా మార్పు కోసం అవకాశం కల్పించారని అన్నారు. మీ గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞ జూనియర్ కాలేజ్ కరెస్పాండెంట్ రాము, ఆర్ఐ వినయ్, విఆర్వో గోపి తదితరులు పాల్గొన్నారు.